భావి భారతానికి గోరుముద్ద

- చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం
- పకడ్బందీగా జగనన్న గోరుముద్ద

ఉప్పలగుప్తం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. పోషకాలున్న ఆహారాన్ని తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులోనూ రాణిస్తారనే ఉద్దేశంతో రోజుకో మెనూతో గోరుముద్దను అమలు చేస్తోంది. ఎప్పటికప్పుడు మెనూను మెరుగుపరుస్తూ విద్యార్థులకు రుచికరమైన ఆహారంతో పాటు రాగి జావను సైతం అందిస్తుంది. అందుకే గతం కంటే ఇష్టంగా విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా నాణ్యమైన ఆహారాన్ని అందించటంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుంది. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి ఉదయం సమయంలో ప్రతి విద్యార్థికి 100 ఎంఎల్ రాగి జావను అల్పాహారంగా అందిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థుల శరీరానికి అధిక పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. రాగి జావ తాగడానికి వీలుగా ప్రతి విద్యార్థికి స్టీల్ గ్లాసులను ప్రభుత్వం అందించింది. రోజూ విటమిన్‌లతో కూడిన ఆహారాన్ని ప్రత్యేక మెనూ ఏర్పాటుచేసి వండి వడ్డిస్తూ విద్యార్థులకు భోజనంపై ఆసక్తిని పెంచుతున్నారు. వారంలో రోజువిడిచి రోజు మూడు రోజులు రాగి జావ, మరో మూడు రోజులు వేరుశనగ చిక్కీ, రోజూ ఉడికించిన గుడ్డు విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రత్యేక పర్యవేక్షణగా పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ, టేస్టింగ్ కమిటీ ఏర్పాటుచేసి వారి సూచనల మేరకు మార్పులు చేస్తున్నారు. రోజూ పాఠశాలలో వండే వంటకాలను మెనూ ప్రకారం జరిగేలా ప్రభుత్వం ఒక సాఫ్ట్‌వేర్‌ను ఉపాధ్యాయుల ఫోన్‌లో అనుసంధానం చేసింది. దీంతో ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం ఆహారం విద్యార్థులకు అందుతుంది. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోపాలుంటే సరిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రైవేటు హాస్టల్స్‌ను మించి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నారని, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటంతో తమ పిల్లలు ఆరోగ్యంగా ఉంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఉప్పలగుప్తం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

వారాంతపు భోజన పట్టిక

సోమవారం	పప్పుచారు, గుడ్డు కూర, వేరుశెనగ చిక్కీ
మంగళవారం	పులిహోర, టమాటా పప్పు, ఉడికించిన గుడ్డు
బుధవారం	బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ
గురువారం	కిచిడీ, టమాటా పచ్చడి, ఉడికించిన గుడ్డు
శుక్రవారం	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ
శనివారం	సాంబారు, తీపి పొంగలి

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	భోజనం చేస్తున్నవారు
అమలాపురం	106	9100	7200
అల్లవరం	79	4384	3480
ఉప్పలగుప్తం	83	4790	3900

భోజనం రుచిగా ఉంటుంది



మేము గొల్లవిల్లి సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో ఉండి చదువుకుంటున్నాం. మా పాఠశాలలో తయారుచేసే భోజనం రుచిగా ఉంటుంది. ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రకారమే రోజూ పోషకాలతో కూడిన భోజనం పెడుతున్నారు.

– డి.శైలజ, 10వ తరగతి విద్యార్థిని, గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

పిల్లలకు మెరుగైన ఆహారం



పిల్లల చదువు విషయంలో, ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. మా అబ్బాయి విలసవిల్లి మండల పరిషత్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. రోజూ నేను మా అబ్బాయిని బడిలో భోజనం గురించి అడిగి తెలుసుకుంటాను. పిల్లలకు పోషకాలతో కూడిన నాణ్యమైన, మెరుగైన ఆహారం అందుతుంది.

– సాగా నాగమల్లేశ్వరి, విద్యార్థి తల్లి, విలసవిల్లి ఉప్పలగుప్తం మండలం

జనసేతకు ఆత్మీయ స్వాగతం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత పథకం ప్రారంభోత్సవానికి శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

యానాం: పుదుచ్చేరిలో ఈ నెల 20వ తేదీ నుంచి జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలకు యానాం పబ్లిక్ స్కూల్ నుంచి అంగాడి హేమంత్‌కుమార్(బాల్ బ్యాడ్మింటన్), వాకపల్లి శశిధర్(బాల్ బ్యాడ్మింటన్), నల్లా అమన్ సరోజ్‌కుమార్(క్యారమ్స్) ఎంపికైనట్లు శనివారం హెచ్‌ఎం గుడాల బాలాజీ సుధాకర్ తెలిపారు. విద్యార్థులతో పాటు వారికి కోచింగ్ ఇచ్చిన పీఈటీ అజయ్‌కుమార్‌ను స్కూల్ చైర్మన్ చింతా వెంకటరామయ్య అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, వైద్య సిబ్బందికి శనివారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్ మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌ఎల్‌ఓ, కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో


వన్నెచింతలపూడిలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో వసంత రాయుడు

అమలాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్‌వీఎస్ వసంత రాయుడు తనిఖీ చేశారు. శనివారం బండారులంకలో 8, 9, 10, 11, 12 పోలింగ్ కేంద్రాలు, నల్లమిల్లిలో 15, 16 పోలింగ్ కేంద్రాలు, వన్నెచింతలపూడిలోని 111, 112 పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఎన్నేసి ఓట్లున్నాయో అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. లొకేషన్ మార్పులపై చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పరమట శ్రీపల్లవిని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వోలు రాజేష్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

యానాం: ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సూర్య పాలీక్లినిక్ అండ్ దీప్తి స్కాన్ సెంటర్ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సమగ్ర కంటి పరీక్షలను నిర్వహిస్తారన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు ఎంపీపీ రాయుడు సునీత నియామక పత్రాలు శనివారం అందజేశారు. జార్జిపేటకు చెందిన గొల్లపల్లి దుర్గ, కోరంగికి చెందిన వనుం సత్య దుర్గ, దొమ్మేటి హేమ, కొప్పిశెట్టి మహేష్, గాడిమొగకు చెందిన గేదెల కిరణ్, తాళ్లరేవుకు చెందిన రేకాడి మాధురి, కాటాడి సాయిలక్ష్మిలకు నియామక పత్రాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, కుడుపూడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి చీఫ్ జడ్జిగా చంద్రశేఖరన్

యానాం: పుదుచ్చేరి కోర్టు చీఫ్ జడ్జిగా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం చెన్నై హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జ్యోతిరామన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ పుదుచ్చేరి ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సెల్వనాథన్‌ను చెన్నై హైకోర్టు రిజిస్ట్రార్‌గా నియమించారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం సచివాలయలంలో సర్పంచ్ కుంచే బుల్లియ్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎస్.యానాం పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, వలంటీర్లకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, సచివాలయ కార్యదర్శి బి.సుమ, కుంచే స్వామి, కోరుకొండ కిరణ్, కంతంశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రాధాన్యమివ్వాలి


తాండవపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రాధాన్యమిచ్చి ఇంటింటి సర్వే 100 శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావు దొర అన్నారు. శనివారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే జరుగుతున్న విధానాన్ని తనిఖీ చేశారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇమ్మిడివరప్పాడు, తాండవపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం రోళ్లపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట వైద్యాధికారి ములపర్తి శాంతిలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారి రామకృష్ణమూర్తి, సూపర్‌వైజర్ కామేశ్వరరావు తదితరులున్నారు.

కాపు మహిళలకు ఆర్థిక భరోసా


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి, లబ్ధిదారులు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కాపు నేస్తం పథకంతో ఏటా రూ.15 వేలు అందిస్తూ కాపు మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. శనివారం మండలంలోని విలసవిల్లి సచివాలయంలో స్థానిక కాపు మహిళలంతా సమావేశమై సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి మాట్లాడుతూ సీఎం జగన్ మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఒక్క విలసవిల్లి గ్రామంలోనే ఇప్పటికే మూడు విడతల్లో రూ.76.95 లక్షలను కాపు మహిళల ఖాతాల్లో జమచేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసి కృతజ్ఞత తెలుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, అడబాల సురేష్, బళ్ల నాగసతీష్, పుత్సల ఏసు, ఎస్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతే ముద్దు

- వినాయక మట్టి ప్రతిమల పంపిణీ
- విద్యార్థులతో చైతన్య ర్యాలీలు


విగ్రహాలను తయారు చేసి ప్రదర్శిస్తున్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు

అమలాపురం రూరల్: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1500 వినాయక మట్టి ప్రతిమలను కొంకాపల్లిలో జాతీయ రహదారిపై భక్తులకు ఉచితంగా అందించారు. లయన్స్ క్లబ్ రీజనల్ జోన్ చైర్మన్ ముదునూరి రామరాజు మాట్లాడుతూ ప్రజలు మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గోకవరపు మల్లికార్జున స్వామి, జోన్ చైర్మన్ జంపన సుమన్ వర్మ, కార్యదర్శి చిక్కాల సతీష్, కోశాధికారి తాడి వెంకట సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి స్కూలు విద్యార్థులు మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను పలు ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకెళ్లి అధికారులకు అందించి ప్రశంసలందుకున్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో వసంతరాయుడు, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులకు విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. వినాయక చవితి ఉత్సవాలకు మట్టి వినాయక ప్రతిమలనే ఉపయోగించాలంటూ అమలాపురం పట్టణంలోని పలు విద్యాలయాల విద్యార్థులు శనివారం ర్యాలీ చేశారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు.

కాట్రేనికోన: మండలంలోని కుండలేశ్వరం పంచాయతీ కుంచనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మట్టి గణపతే ముద్దు, రసాయన బొమ్మలు వద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేసి గ్రామంలో ఇంటింటా పంపిణీ చేశారు.


జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు మట్టి గణపతి ప్రతిమలను అందజేస్తున్న విద్యార్థులు


అమలాపురంలో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ముగిసిన ఇంజినీర్స్ డే వేడుకలు


విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న ఐఐటీ ప్రొఫెసర్లు

తాళ్లరేవు: ఇంజినీరింగ్ పితామహుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో వారం పాటు నిర్వహించిన ఇంజినీర్స్ డే వేడుకలు శనివారంతో ముగిశాయి. కళాశాలలోని సమావేశపు హాలులో నిర్వహించిన వేడుకల్లో క్రిఫి సొల్యూషన్స్ సీఈఓ ఎం.కృష్ణారెడ్డి, హైదరాబాద్ ట్రిపుల్ ఐటి ప్రొఫెసర్లు దుర్గా భవాని, మేఘన తదితరులచే శాస్త్ర సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్ బాలాలిఖిత్, ప్రొఫెసర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు


చొల్లంగి హైస్కూల్‌లో ఉత్సాహంగా సాగుతున్న క్రీడా పోటీలు

తాళ్లరేవు: మండలంలోని చొల్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో అండర్-17 విభాగంలో కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ తాళ్లరేవు ప్రథమ స్థానం, జెడ్పీహెచ్‌ఎస్ పిల్లంక ద్వితీయ స్థానంలోనూ నిలిచాయి. వాలీబాల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ జి.వేమవరం విజయం సాధించగా, జెడ్పీహెచ్‌ఎస్ బీసీ హెచ్‌వీపాలెం ద్వితీయ స్థానం సాధించింది. టెన్నీకాయిట్‌లో చొల్లంగిపేట జట్టు విజయం సాధించింది. అండర్-14 విభాగంలో కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ గాడిమొగ, ఖోఖోలో జెడ్పీహెచ్‌ఎస్ చినవలసల, వాలీబాల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ పి.మల్లవరం, త్రోబాల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ జి.వేమవరం, టెన్నికాయిట్‌లో జెడ్పీహెచ్‌ఎస్ చొల్లంగి జట్లు విజయం సాధించాయి. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని స్టాఫ్ కోఆర్డినేటర్ వీకేఆర్ తంబి తెలిపారు. విజేతలకు స్థానిక నాయకులు బూరెల వెంకట్రాజు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ, చొల్లంగి హైస్కూల్ హెచ్‌ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికాస్ దివస్


విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లి రవితేజ జూనియర్ కళాశాలలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నెహ్రూ యువ కేంద్రం, నవభారత్ యువ నిర్మాణ్ సంఘ్ సంయుక్తంగా వికాస్ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమలాపురం ది చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్రా యోజన, యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్, స్టార్టప్ ఇండియా వంటి పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవభారత్ యువ నిర్మాణ్ సంఘ్ అధ్యక్షుడు బొంతు ఉదయ్‌కుమార్, డి.కిషోర్, గొంతు శివాజీ, పాటి సత్తిరాజు, ప్రసాద్, గాలి సుబ్రహ్మణ్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంతా కలిసికట్టుగా పనిచేయాలి

ఎంపీపీ వీర అచ్యుత జానకి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జానకి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి మత్స్యశాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు రాకపోవడంతో ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపద రావు మాట్లాడుతూ ప్రతి సమావేశంలో చర్చిస్తున్న సమస్యలను పరిష్కారమయ్యాయో లేదో తదుపరి సమావేశంలో చూపించాలని విజ్ఞప్తి చేశారు. తన గ్రామంలో అభివృద్ధి పనులు తమకు తెలియకుండానే చేస్తున్నారంటూ భీమనపల్లి సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. ఆక్వా అక్రమ సాగుపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవటం లేదని గొల్లవిల్లి సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు అధికారులకు వినతి పత్రం అందించారు. గోకనవెల్లిలో జలజీవన్‌మిషన్ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని తక్షణమే పనులు ప్రారంభించాలని సర్పంచ్ ఊర్మిళాదేవి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.36 కోట్లతో జరుగుతున్న పనుల్లో అవినీతి జరుగుతుందంటూ సర్పంచ్ మద్రంశెట్టి రామచంద్రరావు ఎస్ఎస్ఏ జేఈ నారాయణరావును నిలదీశారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపించాలని సర్పంచ్ రామచంద్రరావు ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, చిట్టి కుమారి, శ్రీదుర్గ, ఈశ్వరి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, ఎంపీడీవో కేవీఎస్ గౌరీకుమారి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శేషగిరిరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రెయిన్స్ ఏఈ సునీతాదేవి మాట్లాడుతూ ఎన్.రామేశ్వరం మొగని ఓపెన్ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలో పనులు చేపట్టి ముంపు తీవ్రత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 22ఏ జాబితాలోని భూములు, డీపట్టా, ప్రభుత్వ భూములపై సర్వే చేసి తుది నివేదిక ఉన్నతాధికారులకు పంపించనున్నామని తహసీల్దార్ సాంబశివప్రసాద్ అన్నారు. జేజేఎం రెండో విడత నిధులు రూ.15 కోట్లకు పనులు టెండర్ స్థాయిలో ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి తెలిపారు. మత్స్యకారులు వేటాడుతూ ప్రమాదవశాత్తు చనిపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.10 లక్షల పరిహారం అందుతుందని ఎఫ్‌డీఓ అశ్విని తెలిపారు. జగనన్న కాలనీల్లో రెండో విడతగా 1010 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధ చేశామని హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రాయుడు విష్ణు, సుందరనీడి సాయి, దాకారపు చిరంజీవి రావు, రాకాపు విజయలక్ష్మి, రొక్కాల విజయలక్ష్మి, బత్రే సీతారత్నం, మల్లాడి మంగాయమ్మ, సాధనాల వెంకటనాగమణి, ఎంపీడీఓ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు-అనర్థాలపై అవగాహన


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఐ.పోలవరం: స్థానిక పశువుల్లంక మొండి గ్రామంలో రామాలయం వద్ద శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విస్తరణాధికారి సీహెచ్ నాగలక్ష్మి గ్రామ స్థాయిలో నమోదవుతున్న 18 ఏళ్లలోపు వయసున్న గర్భవతులను గుర్తించి, దాని వల్ల జరిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ అమలులో ఇబ్బందులు

యానాం: కేంద్ర ఆరోగ్య పథకమైన ఆయుష్మాన్ భారత్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలులో లోపాల కారణంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారని పుదుచ్చేరి ఎంపీ వైతిలింగం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రంగసామి ఆరోగ్యశాఖ నుంచి సమగ్ర సమాచారాన్ని తెప్పించుకోవాలన్నారు. వేలాదిమందికి ఆయుష్మాన్ కార్డులు ఇచ్చినా డేటా సరిగా లేక పథకం ముఖ్య ఉద్దేశం దెబ్బతిందని ఆరోపించారు.

స్వచ్ఛ సాగర్‌పై అవగాహన సదస్సు


చిర్రయానంలో నిర్వహించిన అవగాహన సదస్సులో సంస్థ ప్రతినిధులు

కాట్రేనికోన: మండలంలోని చిర్రయానం సముద్ర తీరంలో అంతర్జాతీయ తీర శుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్తంగా స్వచ్ఛసాగర్-సురక్షసాగర్‌పై అవగాహన సదస్సు నిర్వహించింది. చిర్రయానం ప్రజల భాగస్వామ్యంతో తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మత్స్యశాఖ డీడీ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్స్యకారులు పాడైన ప్లాస్టిక్ వలలు, గేలాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్ర జలాల్లో పడేయొద్దన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్‌డీఓ రామకృష్ణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

వాహనాలను అడ్డుకున్న కార్మికులు

అల్లవరం: ఓడలరేవు సెంటర్‌లో ప్రధాన కాంట్రాక్టు దారుడైన టాటా కంపెనీకి చెందిన వాహనాలను వేవ్ ఎనర్జీ కంపెనీకి చెందిన కార్మికులు శనివారం అడ్డుకున్నారు. నాలుగు రోజులుగా టెర్మినల్ వద్ద కార్మికులు నిరసన తెలుపుతున్న కార్మికులు యాజమాన్యం నుంచి సరైన హామీ లభించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి

ముమ్మిడివరం: వచ్చే నెల 1వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే 17వ రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. శనివారం స్థానిక ఎయిమ్స్ కళాశాలలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోనసీమ జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై ఐక్యతను చాటాలన్నారు.